## క్లుప్తంగా

### ఆలస్యంతో అవస్థలు

**అశ్వాపురం:** మణుగూరు–సికింద్రాబాద్‌కు నడుస్తున్న రెండు రైళ్ల ప్రయాణం ఆలస్యంతో ప్రయాణికులు, ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. సికింద్రాబాద్ నుంచి మణుగూరు 6 గంటల ప్రయాణం. కానీ 12 నుంచి 14 గంటలు సమయం పడుతుండటంతో ఇబ్బంది పడుతున్నామని ప్రయాణికులు, ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మణుగూరు పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుండటంతో రైలు ప్రయాణంపై కార్మికులు, ఉద్యోగులు, ప్రయాణికులు ఆధారపడుతున్నారు. షిఫ్ట్, జనరల్ డ్యూటీలకు వెళ్లే ఉద్యోగులు తమ విధులు రైలు ప్రయాణంలోనే జరుగుతున్నాయని ఉద్యోగులు, కార్మికులు ఆవేదన చెందుతున్నారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే దృష్టి సారించి రైల్వే అధికారులతో మాట్లాడి రెండు రైళ్ల షెడ్యూల్ ప్రకారం నడిపేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు, ఉద్యోగులు, ప్రయాణికులు కోరుతున్నారు.

### సర్వసభ్య సమావేశం

**అన్నపురెడ్డిపల్లి:** మండల సర్వసభ్య సమావేశం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద శనివారం ఎంపీపీ సున్నం లలిత అధ్యక్షతన సాదాసీదాగా జరిగింది. అధికారులు తమ, తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణపై ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎంపీపీ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు భారత లాలమ్మ, ఎంపీడీఓ అన్నపూర్ణ, వైస్‌ఎంపీపీ మామిళ్లపల్లి రామారావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

### వేంకటేశ్వర కల్యాణం

**అన్నపురెడ్డిపల్లి:** మండల కేంద్రంలో శ్రీదేవి, భూదేవి సమేత బాలాజీ వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని శనివారం ఘనంగా జరిపించారు. స్వామి వారికి ఉదయం పంచామృత అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు స్వామి వారి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామి వారి కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కల్యాణం అనంతరం భక్తులకు ఆలయ అధికారులు అన్నప్రసాదాలను అందజేశారు.

### ఉచిత వైద్య శిబిరం

**మణుగూరురూరల్:** లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు ఆధ్వర్యంలో హైదరాబాద్ ఏపీఎస్ హాస్పిటల్స్ వారి సౌజన్యంతో శనివారం అంబేడ్కర్ సెంటర్‌లోని డాక్టర్ కోటేశ్వరరావు హాస్పిటల్ వద్ద ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో అల్సర్, బోధకాలు, నరాల బలహీనత, నరాల వ్యవస్థ నలిగి పోవడం తదితర వ్యాధులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మణుగూరు ఎస్సై బి.రాజేష్‌కుమార్, డాక్టర్ గాజుల కోటేశ్వరరావు, డాక్టర్ గణేషులు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గాజుల పూర్ణచందర్‌రావు, పాస్ట్ జోన్ చైర్మన్ దోసపాటి వెంకటేశ్వరరావు, ప్రోగ్రామ్ చైర్‌పర్సన్ గాజుల రమేష్‌కుమార్, ముత్తంశెట్టి నాగేశ్వరరావు, డాక్టర్ బాలకృష్ణ, బేతంచర్ల వెంకటేశ్వరరావు, అడబాల నాగేశ్వరరావు, డాక్టర్ సమ్మయ్య, జోన్ చైర్‌పర్సన్ కృష్ణమోహన్, శ్రీనివాస్, రాంబాబు పాల్గొన్నారు.

### పైప్‌లైన్‌కు మరమ్మతులు

**మణుగూరురూరల్:** కూనవరం గ్రామపంచాయతీలోని కోడిపుంజుల వాగు బ్రిడ్జి వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్ ఇటీవల వరదల కారణంగా దెబ్బతినగా.. పంచాయతీ సర్పంచ్ ఏనిక ప్రసాద్ మరమ్మతులు చేయిస్తున్నారు. 15 రోజులుగా పంచాయతీ ప్రజలకు నీటి సరఫరా నిలిచిపోవడం, ప్రస్తుతం వరద ఉధృతి తగ్గడంతో సర్పంచ్ చర్యలు తీసుకున్నారు. సోమవారంలోగా ప్రజలకు మంచినీరు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి సంధ్యారాణి పాల్గొన్నారు.

### తుమ్మలకు రైతుల వినతి

**దమ్మపేట:** మండల పరిధిలోని లింగాలపల్లి రైతులు గండుగులపల్లి గ్రామంలో ఉన్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను ఇప్పించాలని విన్నవించారు. తమ గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 1458లో వ్యవసాయ భూములకు సంబంధించి ఇప్పటికీ పాస్ పుస్తకాలను పంపిణీ చేయలేదని, తద్వారా రైతుబంధు వంటి వ్యవసాయం పథకాలకు దూరమవుతున్నామని వాపోయారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని తుమ్మల హామీ ఇచ్చారు.

### కరపత్రాలు పంపిణీ

**చండ్రుగొండ:** మండలంలోని పోకలగూడెం గ్రామంలో పల్లెపల్లెకు ఇందిరమ్మబాట కరపత్రాలను టీపీసీసీ సభ్యురాలు, ములకలపల్లి జెడ్పీటీసీ సున్నం నాగమణి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ గుగులోతు బాబు, గండారపు సీతారాములు పాల్గొన్నారు.

### కనీస వేతనం ఇవ్వాలి

**ములకలపల్లి:** పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని తెలంగాణా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శిలో ముదిగొండ రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో శనివారం జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘ మండల కార్యదర్శి మాలోతు రావూజా, పులి వెంకటేశ్వర్లు, కంపసాటి వెంకటేశ్వర్లు, సామిని పాల్గొన్నారు.

# ‘మన్యం’ క్రీడాకారుల ప్రతిభ

- టార్గెట్ బాల్ పోటీల్లో సత్తా చాటుతున్న గిరిజన విద్యార్థులు
- జాతీయ స్థాయిలో రాణింపు..
- సాయం అందిస్తే ప్రపంచ స్థాయికి సమాయత్తం
- ఉద్యోగావకాశాలు కల్పించాలని క్రీడాకారుల డిమాండ్




పతకాలు, ప్రశంసా పత్రాలతో ఇర్పా అనిత, సాయి వినయ్



అల్వాల్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో తన జట్టుతో ఇర్పా అనిత

సండే స్పెషల్

**చర్ల:** మన్యంలో ఉన్న క్రీడాకారులు తమ సత్తా చాటుతున్నారు. ప్రతిభ ఉన్నా ప్రోత్సాహం లేకపోవడంతో వారిలో ఉన్న క్రీడా నైపుణ్యం బయట ప్రపంచానికి తెలియకుండా పోతోంది. ఏజెన్సీలో క్రీడా ముత్యాలుగా ఉన్న గిరిజన క్రీడాకారులకు పాలకులు సాయం అందించి వారి ప్రతిభకు మరింత పదును పెడితే వారు ప్రపంచాన్నే చుట్టి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. చర్ల మండలంలో టార్గెట్ బాల్ పోటీల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులు ఉండగా.. వారిలో మండలంలోని బోదనెల్లికి చెందిన గిరిజన యువతి ఇర్పా అనిత, పూసుగుప్పకు చెందిన సోడి సాయి వినయ్‌లు ఉన్నారు.

**అనతికాలంలో అనిత ఎదుగుదల..**

చర్ల మండలంలోని బోదనెల్లికి చెందిన ఇర్పా అనిత డిగ్రీ పూర్తి చేసి ప్రస్తుతం స్వగ్రామంలోనే ఉంటోంది. చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న సందర్భంలో 2018 నుంచి టార్గెట్ బాల్ పోటీల్లో పాల్గొనడం ప్రాంభించిన అనిత.. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో వాయువేగంతో రాణించింది. 2018లో హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన 5వ జూనియర్ నేషనల్ టార్గెట్ బాల్ పోటీల్లో తెలంగాణా రాష్ట్రం తరుపున ఆడి విజయం సాధించింది. అదే సంవత్సరం హర్యానాలో జరిగిన 6వ జాతీయ స్థాయి టార్గెట్‌బాల్ పోటీల్లో పాల్గొని సత్తా చాటి ద్వితీయ స్థానం సాదించింది. 2019లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జైపూర్‌లో జరిగిన పోటీల్లో పాల్గొని విజయ బావుటా ఎగురవేసింది. నాసిక్‌లో జరిగిన మూడవ సీనియర్ నేషనల్స్‌లో ఆడి సత్తా చాటి బంగ్లాదేశ్‌లో జరగాల్సిన అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. కానీ పాస్‌పోర్ట్ లేని కారణంగా బంగ్లాదేశ్‌లోని పోటీల్లో పాల్గొనలేకపోయింది. అటు తరువాత అంతర్జాతీయ స్థాయిలో డాకాలో జరిగిన పోటీలకు దాతల సహకారంతో పాస్‌పోర్ట్ తీసుకు వెళ్లి ఆడింది. నిజామాబాద్‌లో జరిగిన 7వ జూనియర్ నేషనల్ పోటీల్లో పాల్గొని సత్తా చాటింది.జాతీయ స్థాయిలో సీనియర్స్ విభాగంలో బీహార్‌లో జరిగిన పోటీల్లో పాల్గొని భారత్ నుంచి ప్రతిభ కనబరచింది. అంతర్జాతీయ స్థాయిలో శ్రీలంకలో జరిగే పోటీలకు ఎంపికయినప్పటికీ అప్పట్లో కరోనా నేపథ్యంలో ఈ పోటీలు రద్దయ్యాయి.

**డైమండ్ ప్లేయర్‌గా సాయి వినయ్..**

అంతర్జాతీయ స్థాయిలో పలుమార్లు ఆడిన సాయి వినయ్ డైమండ్ ప్లేయర్‌గా గుర్తింపు పొందాడు. చర్ల మండలంలోని పూసుగుప్ప గ్రామానికి చెందిన సోడి సాయి విజయ్ ప్రస్తుతం డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు. ఇంటర్ మొదటి సంవత్సరం నుంచి టార్గెట్‌బాల్‌పై గురిపెట్టిన సాయి వినయ్ జాతీయ అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించాలన్న లక్ష్యంతో సాధన చేశాడు. ఈ క్రమంలో రాష్ట్రస్థాయి జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన సాయి వినయ్ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్తాయిలోనే ఆడి సత్తా చాటాడు. హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన 5వ జాతీయ స్థాయి సబ్ జూనియర్స్ పోటీల్లో పాల్గొని విజయాన్ని సాధించాడు. 2018లో హర్యానాలో జరిగిన 6వ జూనియర్స్ నేషనల్స్‌లో ఆడి సత్తా చాటాడు. విశాఖపట్నంలో జరిగిన సీనియర్స్ నేషనల్స్‌లో ఆడి బెస్ట్ డైమండ్ అవార్డు దక్కించుకున్నాడు. నాసిక్‌లో జరిగిన నేషనల్ ఫెడరేషన్ కప్‌లో ఆడి సత్తా చాటి మూడో స్థానాన్ని కైవసం చేసుకోగా అంతర్జాతీయ స్థాయిలో బంగ్లాదేశ్‌లో జరిగిన పోటీల్లో పాల్గొనాల్సి ఉన్నప్పటికీ పాస్‌పోర్ట్ లేకపోవడంతో పాల్గొనలేకపోయాడు. 2019లో నిజామాబాద్‌లో 7వ జూనియర్స్ నేషనల్స్‌లో సత్తా చాటి పతకాన్ని సాధించాడు. బీహార్‌లో జరిగిన 6వ సీనియర్ నేషనల్స్ పోటీల్లో ఆడి విజయం సాధించిన సాయివినయ్.. శ్రీలంకలో జరగాల్సిన అంతర్జాతీయ టార్గెట్‌బాల్ క్రీడా పోటీలకు ఎంపికయ్యాడు. అప్పట్లో కరోనా కారణంగా ఆ పోటీలు వాయిదా పడ్డాయి.

**ప్రభుత్వం ప్రోత్సహించాలి**

టార్గెట్‌బాల్‌కు గుర్తింపు తీసుకొచ్చేందుకు ఎంతగానో కష్టపడుతున్నాం. రాష్ట్ర, దేశ, అంతర్జాతీయ స్థాయిలోనూ ఆడుతూ క్రీడకు గుర్తింపు తీసుకురావడంతో పాటు ఏజెన్సీ క్రీడా సత్తాను దేశ నలుమూలలా చాటుతున్నాం. ప్రభుత్వం మమ్మల్ని ప్రోత్సహించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉద్యోగావకాశాలలో అవకాశం కల్పించాలి.

– ఇర్పా అనిత, టార్గెట్ బాల్ క్రీడాకారిణి, బోదనెల్లి

**పీఈటీగా అవకాశం కల్పించాలి**

టార్గెట్ బాల్ క్రీడను దేశ నలుమూలలా తెలిసేలా చేసి ఏజెన్సీ క్రీడా సత్తాను భయటి ప్రపంచానికి తెలిసేలా కఠోరంగా శ్రమించాం. ఆ శ్రమతోనే పలు చోట్ల ఆడి ఏజెన్సీ క్రీడా సత్తాను బయటి ప్రపంచానికి తెలియజేశాం. ప్రభుత్వ పాఠశాలల్లో ఈ క్రీడను పరిచయం చేయాలి. మాకు ప్రభుత్వ పాఠశాలల్లో పీఈటీలుగా అవకాశం కల్పించాలి.

– సోడి సాయి వినయ్, టార్గెట్‌బాల్ క్రీడాకారుడు, పూసుగుప్ప

# సర్కారు బడుల్లో రాగిజావ



దుమ్ముగూడెం: అచ్చితాపురం పాఠశాలలో రాగిజావ అందజేస్తున్న ఉపాధ్యాయులు

**దమ్మపేట:** మండల కేంద్రంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులకు రాగి జావ ప్యాకెట్లను శనివారం ఎంఈఓ కీసర లక్ష్మి చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులకు బలమైన పౌష్టికాహారాన్ని అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన మెనూలో వారంలో మూడు రోజులు రాగి జావను అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జగపతి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

**దుమ్ముగూడెం:** మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా మండలంలోని 103 పాఠశాలలో శనివారం నుంచి రాగి జావ పంపిణీ చేసినట్లు ఎంఈఓ సున్నం సమ్మయ్య తెలిపారు. ఇందులో భాగంగా ఒక్కో విద్యార్థికి 10 గ్రాముల రాగి పిండి, 10గ్రాముల బెల్లం అందజేస్తున్నట్లు వెల్లడించారు.

# ముంపు రైతులకు ఎరువుల పంపిణీ

**గుండాల:** మండలంలోని సాయనపపల్లి గ్రామంలో ముంపునకు గురైన బాధితులకు మండల కేంద్రానికి చెందిన తిరొక్కవళ్లూరి (పట్వారి)వెంకన్న వ్యాపారి ఆధ్వర్యంలో ఎరువు బస్తాలు పంపిణీ చేశారు. గ్రామంలో 33 మంది ఇళ్లు నీట మునగగా.. వీరిలో ఆరుగురు రైతుల ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కాగా వెంకన్న 33 మంది రైతులకు 3 యూరియా బస్తాల చొప్పున పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాంబయ్య, రమేష్, బుచ్చయ్య, బాటయ్య తదితరులు పాల్గొన్నారు.



యూరియా బస్తాలు పంపిణీ చేస్తున్న పట్వారి వెంకన్న

# బాధితులకు అండగా ఉండాలి

**దుమ్ముగూడెం:** మణిపూర్ బాధితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలబడాలని ఆదివాసీ ఐక్య కార్యచరణ వేదిక డిమాండ్ చేసింది. శనివారం సంఘం ఆధ్వర్యంలో ములకపాడు తెల్లం హరికృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మణిపూర్‌లో జరిగిన దుశ్చర్యలను ఖండిస్తూ ఆదివాసీ మృతులకు సంతాపం ప్రకటించారు. ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొమరం దామోదర రావు, సోందె మల్లూరు, కణితి రాముడు, సరియం భీమ్, చంటి, కామరాజు, పర్ణశాల సర్పంచ్ తెల్లం వరలక్ష్మి, మడకం భారతి, వాగే రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# పోరాటాలే బోడేపూడికి నివాళి




వర్ధంతి సభలో మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్‌రావు

**భద్రాచలంఅర్బన్:** శ్రామిక వర్గం ఐక్యత కోసం కృషి చేయడం, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయడమే సీపీఎం సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బోడేపూడి వెంకటేశ్వరరావుకు ఇచ్చే ఘన నివాళి అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ రావు అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అధ్యక్షతన బండారు చందర్‌రావు భవన్‌లో బోడేపూడి వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకుడు ఎం.సాయిబాబు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన వర్ధంతి సభలో పోతినేని సుదర్శన్ రావు మాట్లాడుతూ.. బోడేపూడి ఆదర్శ కమ్యూనిస్టుగా అభివర్ణించారు. సభలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చ వెంకటేశ్వర్లు, నూడి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్ రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కారం పుల్లయ్య, కె.బ్రహ్మచారి, లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు, ములుగు జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### 7 నుంచి టీకాలు

**అశ్వారావుపేటరూరల్:** పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ నుంచి జీవాలకు గాలికుంటు నివారణ టీకాలు వేయనున్నట్లు ఆ శాఖ మండల పశు వైద్యాధికారిణి స్వప్న తెలిపారు. ఈ మేరకు ఆమె శనివారం మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ టీకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, పశు వైద్య బృందం గ్రామాలకు వచ్చిన సమయంలో గేదలు, ఆవులు, ఎద్దులు, దూడలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు.

### 10న విద్యుత్ వినియోగదారుల సదస్సు

**ములకలపల్లి:** మండలకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో ఈనెల 10న విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మీ నర్సింహారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు టీఎస్ఎన్‌పీడీసీఎల్ చైర్‌పర్సన్ వేణుగోపాలచారి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. వాడకున్న హెచ్చు మొత్తంలో బిల్లులు, కేటగిరి మార్పు, సర్వీస్ రద్దు, ఇతర విద్యుత్ సమస్యలపై పాల్వంచ, ములకలపల్లి మండలాల వినియోగదారులు ఈ సదస్సులో లిఖితపూర్వక ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

**అశ్వారావుపేటరూరల్:** రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి శనివారం తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం సుబ్బన్నపేట గ్రామానికి చెందిన గంగుల ఆంజనేయులు ద్విచక్రవాహనంపై అశ్వారావుపేట మండలంలోని వినాయకపురం వైపు వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలోని తిమ్మాపురం మూల మలుపు వద్ద అదుపుతప్పి కింద పడిపోయాడు. గమనించిన స్థానికులు స్థానిక చిట్టితల్లి అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో బాధితుడిని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ఆంజనేయులకు చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ఆస్పత్రికు తరలించారు.

### ఆర్థిక సాయం

**అశ్వాపురం:** మండల కేంద్రానికి చెందిన మిట్టపల్లి వర్షిత డీఎంఎల్‌టీ ద్వితీయ సంవత్సరం చదువుతూ ఆర్థిక ఇబ్బందులు పడుతోంది. ఆమె పరీక్ష ఫీజు నిమిత్తం గౌతమీస్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు అశ్వాపురంలో శనివారం రూ.15వేలు ఆర్థిక సాయం అందజేశారు. పక్షవాతంతో బాధపడుతున్న చింతిర్యాల క్రాస్ రోడ్డుకు చెందిన కోపూరి రాంబాబుకు వైద్య ఖర్చులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కె.సోమయ్య, నారాయణరాజు పాల్గొన్నారు.

# తల్లిపాల వారోత్సవాలు

**ములకలపల్లి:** గుండాలపాడు గ్రామపంచాయతీ చలమన్ననగర్ గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. పలువురు వక్తలు మాట్లాడుతూ .. తల్లిపాల అవశ్యకతను వివరించారు. సూపర్‌వైజర్ మాధవి, పుష్ప, బాలింతలు, చిన్నారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. ములకలపల్లి జీపీ పరిధిలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ సామ్రాజ్యం, సిబ్బంది పాల్గొన్నారు.



చలమన్ననగర్‌లో సామూహిక సీమంతాలు చేస్తున్న సిబ్బంది

# ఆర్టీసీ కార్మికుల నిరసన

**మణుగూరురూరల్:** ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లును గవర్నర్ పెండింగ్‌లో పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ టీఎస్‌ఆర్టీసీ మణుగూరు డిపో ఎదుట కార్మికులు శనివారం నిరసన వ్యక్తం చేయడమే కాకుండా రెండు గంటల పాటు జంగ్ సైరన్ బంద్ నిర్వహించారు. బంద్ సందర్భంగా ఉదయం 6గంటల నుంచి 8గంటల వరకు బస్సులన్నీ డిపోకే పరిమితమయ్యాయి. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపో యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. సుదీర్ఘ ఉద్యమ ఫలితంగా వచ్చిన ఆర్టీసీ విలీన బిల్లును గవర్నర్ ఆపడం సమంజసం కాదని, కార్మికుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ఆమోదించాలని అన్నారు.

**భద్రాచలంటౌన్:** ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లుకు రాష్ట్ర గవర్నర్ ఆమోదం తెలపాలని కోరుతూ.. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు శనివారం డిపో ఎదుట ఆందోళన చేపట్టారు. బస్టాండ్ ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించి గంటపాటు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ బి.రామారావు మాట్లాడుతూ.. ఆర్టీసీ సంస్థ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడంతో ఉద్యోగ భద్రతతో పాటు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అనేక రకాలుగా సౌకర్యాలు పొందే ఆవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో గౌతమి, సాహితీ, నరసింహారావు, నాగేశ్వరరావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# కమిషనర్‌కు ఏఐటీయూసీ వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు

**అశ్వాపురం:** అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలపై హైదరాబాద్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్ భారతిని శనివారం ఏఐటీయూసీ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, గ్రాట్యూటీ, రిటైర్‌మెంట్ బెనిఫిట్లు, పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరుతూ నాయకులు కమిషనర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సాయి ఈశ్వరి, ప్రధాన కార్యదర్శి ఎస్.కరుణకుమారి, రాష్ట్ర ప్రతినిధి బృందం సీహెచ్.సీతామహాలక్ష్మి, చందన, మమత, శ్రీలత, వేల్పుల మల్లికార్జున్ పాల్గొన్నారు.

# డ్రమ్ సీడర్‌తో తక్కువ ఖర్చు

**అశ్వాపురం:** డ్రమ్ సీడర్ వినియోగం ద్వారా తక్కువ ఖర్చుతో వరినాట్లు వేయవచ్చని గొందిగూడెం సర్పంచ్ పాయం భద్రమ్మ అన్నారు. మండల పరిధిలోని గొందిగూడెం గ్రామంలో ఐటీసీ ఎంఎస్‌కే సొసైటీ ఫర్ సంపూర్ణ గ్రామ స్వరాజ్ సంస్థ వారి సూచనలతో గ్రామానికి చెందిన రైతులు కొమరం నాగేశ్వరరావు 3 ఎకరాలు, బొజ్జయ్య 2 ఎకరాలలో డ్రమ్ సీడర్‌తో వరి విత్తారు. శనివారం డ్రమ్ సీడర్‌తో వరి విత్తే కార్యక్రమంలో సర్పంచ్ పాయం భద్రమ్మ పాల్గొని మాట్లాడారు. డ్రమ్ సీడర్‌తో ఎకరాకు 8 నుంచి 12 కేజీల వరి విత్తనాలు సరిపోతాయని, 25 శాతం వరకు నీరు, కూలీ ఖర్చు ఆదా అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ప్రవీణ్, ముత్యాలరావు, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, రైతులు పాయం సర్వేశ్వరరావు, కొమరం రాముడు, కొమరం కల్యాణ్, కొమరం మహేష్, కొమరం లక్ష్మి, బండ్ల జలీందర్ తదితరులు పాల్గొన్నారు.

### బదిలీ అధికారులకు ఘన సన్మానం



మాట్లాడుతున్న డీఎస్పీ రాఘవేంద్రరావు

**మణుగూరురూరల్:** మండలంలోని సీటైప్ ఇల్లెందు క్లబ్‌లో మణుగూరు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శనివారం బదిలీపై వెళ్లిన సీఐ ముత్యం రమేష్, ఎస్సైలు రాజ్‌కుమార్, బట్టా పురుషోత్తంలకు ఘన వీడ్కోలు, సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు, ఏరియా సింగరేణి జీఎం దుర్గం రామచందర్, బీటీపీఎస్ సీఈ బిచ్చన్నలు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మణుగూరు సీఐ బాలాజీ వరప్రసాద్, ఏడూళ్లబయ్యారం సీఐ శివప్రసాద్, అశ్వాపురం సీఐ రవీందర్, ఎస్సైలు బి.రాజేష్‌కుమార్, ఎస్.శ్రీనివాస్, జితేందర్, సురేష్, నాగుల్ మీరాఖాన్, రాజారాం, పోలీసులు పాల్గొన్నారు.

### బదిలీలు చేపట్టాలి

**మణుగూరురూరల్:** ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు మీరాహుస్సేన్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక జెడ్పీ కోఎడ్యుకేషన్ పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను సందర్శించి ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ ఎంఈఓ వీరస్వామి, రిసోర్స్ పర్సన్స్, యూటీఎఫ్ నాయకులు ఇంద్రసేనా రెడ్డి, సీహెచ్ శ్రీనివాస్, కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### కార్మికులకు అన్నదానం

**అశ్వారావుపేట:** గ్రామపంచాయతీ కార్మికులు అశ్వారావుపేటలో చేపట్టిన సమ్మె శనివారం 31వ రోజుకు చేరింది. దీక్షా శిబిరం వద్ద స్థానిక బంగారు దుకాణాల వ్యాపారులు అన్నదానం నిర్వహించారు.

### ప్రతి గృహాన్నీ సందర్శించాలి

**అశ్వారావుపేటరూరల్:** క్షేత్రస్థాయి సిబ్బంది తమ పరిధిలో ఉన్న ప్రతి గృహాన్ని సందర్శించి సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయాలని వినాయకపురం పీహెచ్‌సీ వైద్యాధికారి రాందాస్ నాయక్ ఆదేశించారు. మండలంలోని వినాయకపురం పీహెచ్‌సీలో శనివారం క్షేత్ర స్థాయిలో పనిచేసే క్షేత్ర స్థాయిలో పనిచేసే ఏఎన్ఎం, ఆశాలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సూపర్‌వైజర్లు తదితర సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించి పలు సూచనలు చేశారు. సబ్ యూనిట్ అధికారి ఆజ్మీర వెంకటేశ్వరరావు, సీహెచ్‌వో జయలక్ష్మి, హెచ్‌ఈఓ రాజు, హెచ్‌వీ రాణి, శాంతకుమారి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

### ‘డబుల్’ ఇళ్లు మంజూరు చేయండి

**మణుగూరురూరల్:** మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని మల్లేపల్లి చెరువు ముంపు బాధితులకు ప్రత్యామ్నాయంగా ఇళ్ల స్థలాలు కేటాయించాలని, డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని ఇఫ్టూ అనుబంధ జీఎల్‌బీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌డి.నాసర్‌పాషా కోరారు.

శనివారం ఈ మేరకు మణుగూరు తహసీల్దార్ టి.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. తొలుతగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ శ్రీనివాస్‌కు ఆయన పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.మంగీలాల్, వి.శంకర్ నాయక్, శివరామకృష్ణ, వీర్రాజు, వెంకటేష్, ఈశ్వర్‌తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# నకిలీ సర్వేలపై చర్యలు తీసుకోవాలి

**దుమ్ముగూడెం:** భూములకు పట్టాలిస్తామని చెప్పి దొంగ నోటరీ సర్వేలు చేసిన వారిని శిక్షించాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లలో శనివారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని లింగాపురం, వీరభద్రపురం, జిన్నెలగూడెం, చిన్న కమలాపురం, చిన్న నల్లబెల్లి గ్రామాల్లో సాగు భూములకు పట్టాలిప్పిస్తామని, అందుకోసం సర్వేలు చేయాలని కొంతమంది రైతులతో నమ్మబలికారని ఎన్డీ చర్ల–దుమ్ముగూడెం సబ్ డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్ చెప్పారు. ఆపై సర్వేల కోసం ఒక్కో రైతులు నుంచి రూ.4వేలు వసూలు చేశారని, ఇందుకు సంబంధించి ఓ నోటరీ కీలకంగా వ్యవహరించాడని తెలిపారు. వీరందరిపై కేసులు నమోదు చేసి రైతుల డబ్బులు తిరిగి ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో తునికి నాగేశ్వరరావు, పాయం కామయ్య, కంగాల నాగేశ్వరావు, సున్నం వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న రైతులు